# ఉరి



వింజమూరి కృష్ణమూర్తి

ఇందుమతి హత్య చేసింది. పోలీసులు ఇందుమతిని అరెస్టుచేశారు. ఇందుమతిని కోర్టులో నిలబెట్టారు.... లాయర్లు, డిఫెన్సు లాయర్లు వాదోపవాదనలు.... తగిన సాక్ష్యాలు, తదితర కార్యక్రమాలతో పాటుగా ఇందుమతి కూడా హత్య చేసినట్టు అంగీకరించడం వలన ఇందుమతిని దోషిగా.... హంతకురాలిగా నిర్ధారించి ఇందుమతికి ఉరిశిక్ష విధించారు జడ్జి రాఘవరావుగారు.

ఇందుమతి జైలు గదిలో కటకటాల వెనక గోడవారగా... మోకాళ్ళ మధ్యలో తలపెట్టుకుని కూర్చుంది. ఆ రోజు కోర్టులో జరిగినదంతా ఇందుమతి కళ్ళముందు సినిమాలా కదులుతూంది.

జడ్జి రాఘవరావుగారు చివరకు ఇచ్చిన తీర్పు ఇందుమతిని కదలించలేదు.... కలవరపెట్టలేదు. తీర్పు చెబుతూ ఆయన అన్నమాటలు తలుచుకుంటే ఇందుమతికి బాధ కలగటంలేదు సరికదా జాలికలుగుతోంది.... 'ఇందుమతి గోపాలరావుని హత్య చేసింది ఇందుమతి హంతకురాలు.... ఒక మనిషి ప్రాణం తీసే అధికారం మరో మనిషికి లేదు. ఒక మనిషి నిండునూరేళ్ళు జీవితాన్ని బలితీసుకునే హక్కు మరో మనిషికి లేదు. పరిస్థితులేమైనా.... సాటి మనిషి ప్రాణం మరో సాటి మనిషి తీయడం మహా నేరం... పాపం. మనల్ని పుట్టించిన ఆ దేముడికి కూడా మనల్ని చంపే అధికారంగాని, హక్కుగానీ లేనప్పుడు తోటి మనిషి ప్రాణంతీసే అధికారం.... హక్కు మరో సాటిమనిషికి ఎవరిచ్చారు? చట్టం ఉంది. ఆ చట్టానికి శిక్షించే అధికారం ఉంది... హక్కు ఉంది... ఇందుమతి ఈ చట్టాన్ని కాదని.... తన పరిధులను అతిక్రమించి చట్టాన్ని తన చేతిలోకి తీసుకుని ... ఈ హత్యచేసింది. ఇందుమతి హంతకురాలు.... అందువల్ల ఇందుమతికి ఉరిశిక్ష విధించడమైనది.'

ఇందుమతి ఈ మాటలు తలుచుకుని నవ్వుతుంది....

ఇందుమతి మనసు... మనసు.... మనసు.... అప్పుడు తను గోపాలరావుని .... ఆ నీచుడిని ఆ దుర్మార్గుడ్ని.... ఆ కసాయివాడిని చంపింది. తన కసి తీరా కత్తితో పొడిచి చంపింది.... తను హత్యచేసినట్టుగా తనే చెబుతోంది. ఒప్పుకుంటోంది. కాని ఎందుకు చేసింది హత్య. ఎందుకు చంపాలసొచ్చింది గోపాలరావుని. ఏ పరిస్థితుల్లో, ఎలాంటి స్థితిలో తను ఈ పని చేసింది. ఇవన్నీ తను చెబుతూంటే వినిపించుకో రెందుకు తన మాటలు ఎందుకు పట్టించుకోవటం లేదు. ఆడదానికి ఎంతో విలువైనది శీలం.. ఆ శీలాన్ని దోచుకోవాలని.. తన శీలాన్ని కాలరాయాలనీ. తన మానాన్ని మంటకలపాలని కామాంధ కారంలో తనని బలాత్కారాన్ని చేసి...ఎంతో నీచంగా అసభ్యంగా.. అసహ్యంగా ప్రవర్తించి తనని అనుభవించాలని ప్రయత్నించిన వాడిని కోరలనుంచి .. తప్పించుకోవడానికి తను చేసిన ఆఖరి ప్రయత్నం కూడా ఫలించనప్పుడు తన ప్రాణాన్ని ప్రాణంకన్నా ఎంతో విలువైన శీలాన్ని కాపాడుకోవడానికి మరో గత్యంతరంలేక మరో మార్గం లేక చేతికి అందుబాటులో ఉన్న కత్తితో కసి తీరా అతని గుండెల్లో పొడిచింది . పొడిచింది. ఆ రోజు తన ప్రాణాన్ని, మానాన్ని కాపాడుకోవడానికి తను ఈ పని చేసుండకపోతే... తను గోపాలరావు పాముకోరల్లో ఇరుక్కుపోయి.... పూర్తిగా నమిలిపారేసిన చెరకు ముక్కలా అయిపోయుండేది. ఆ తన జాతి వాళ్లలాగే ఎందరో... ఎందరెందరో ఆడవాళ్ళని పులిపంజాకింద చిక్కిపోయేవారు కాని తను ఆ అవకాశం ఇవ్వలేదు ఆలాంటి దుర్మార్గుల దురాగతాలకీ పాపాత్ముల పైశాచికత్వానికీ.... కసాయి వాళ్ళ కామాంధత్వానికి అంతంగా అతడ్ని చంపింది, హత్యచేసింది ... ఇందులో హత్యచెయ్యడం నా తప్పే తప్పు... అతని నేరం.... తప్పు లేదా .. ? చట్టాన్ని తను చేతుల్లోకి తీసుకుని ఈ హత్య చేసుండకపోతే, ఈ చట్టం తన పోయే ప్రాణాన్ని గాని... శీలాన్ని గాని తిరిగి ఇవ్వగలిగేదా ? చట్టం పుస్తకాలలో చదువుకోవడానికీ.... కోర్టుల్లో వాదించుకోవడానికీ తప్ప.... నిర్దోషులని కాపాడి దోషుల్ని శిక్షించడానికి కాదు. అందుకే తను హత్యచేసింది ఇందుమతి మనసు మనసు....మనసు

ఇందుమతికి ఉరిశిక్షయడానికి మరో మూడు రోజుల వ్యవధి ఉంది. ఉరి తీసేముందు దోషి చివరి కోరిక తీర్చవలసిన బాధ్యత, ధర్మం ప్రభుత్వానిది .. అధికారులది.

ఇందుమతి కోరిన కోరిక అందర్నీ ఆశ్చర్యపరిచింది. నియమ నిబంధనలకి ఎలాంటి అవరోధం కలిగించని ఇందుమతి చివరి కోరికని అంగీకరించక

తప్పలేదు ప్రభుత్వానికి.... ప్రభుత్వ అధికారులకి....

మర్నాడు....

కోర్టులో.... కోర్టు బోనులో ముద్దాయిగా జడ్జి రాఘవరావుగారు....

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఇందుమతి.

ఇందుమతి.... రాఘవరావుగారిని ప్రశ్నిస్తోంది....

"మీ పేరు?" ప్రశ్న.

"రాఘవరావు." జవాబు.

"మీ వృత్తి?"

"న్యాయవృత్తి. జడ్జి."

"మీ వృత్తిధర్మం?"

"న్యాయాన్ని రక్షించి అన్యాయాన్ని శిక్షించాలి.... నిర్దోషులని కాపాడి.... దోషులను చట్టం ప్రకారం శిక్షించాలి"

"ఈ మీ ధర్మాన్ని మీరు న్యాయబద్ధంగా నిర్వహిస్తున్నారని గుండెమీద చెయ్యేసుకుని చెప్పగలరా?"

"తప్పకుండా. నా వృత్తి నిర్వహణలో నేనెప్పుడూ పొరపాటు చెయ్యలేదు. ఇకముందు చెయ్యను కూడా." గంభీరంగా చెప్పారు జడ్జి రాఘవరావు.

"మూడు రోజుల క్రితం.... ఇదే కోర్టులో.... ఒక హత్యానేరంపై ఇందుమతి అనే స్త్రీకి హత్యానేరం కింద శిక్ష విధించారు గుర్తుందా....?" సూటిగా అడిగింది ఇందుమతి.

"గుర్తుంది. ఇందుమతి హత్య చేసింది. ఒక నిండుప్రాణాన్ని బలి తీసుకుంది. సాటి మనిషి ప్రాణంతీసే అధికారంగాని, హక్కుగాని మరో సాటి మనిషికి లేదు. అందుకే ఇందుమతికి ఉరిశిక్ష విధించాను."

"ఇందుమతి ఎలాంటి పరిస్థితుల్లో ఆ హత్యచేసిందో.... ఎందుకు హత్య చేసిందో.... దానికి ఇందుమతి బాధ్యత ఎంతో.... ఆలోచించారా?"

"అవన్నీ ఆలోచించిన తరువాతే... ఇందుమతికి ఆ శిక్ష విధించవలసి వచ్చింది. ఆమె ఏ పరిస్థితుల్లో ఉన్నా ఓ నిండుప్రాణాన్ని తీసే అధికారం ఆమెకి లేదు. ఆమె చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుని.... ఆ హత్యచేసింది. ఇందుమతి హంతకురాలు...."

ఇందుమతి ఒక్కసారిగా గట్టిగా అరిచింది.

"ఆఁ.... అవును.... ఇందుమతి హంతకురాలు...."

కోర్టు హాలంతా ఒక్కసారిగా ప్రతిధ్వనించింది.

హంతకురాలు.... హంతకురాలు.... హంతకురాలు.... అందరి చెవుల్లోనూ ఈ మాటలే గింగుర్లు తిరుగుతున్నాయి.

"అవును. ఇందుమతి హంతకురాలు. హత్య చేసింది. ఒక నిండుప్రాణాన్ని చంపేసింది. ఒక నిండుప్రాణాన్ని తీసే అధికారంగానీ, హక్కుగానీ ఇందుమతికి లేదు. కానీ.... కానీ.... ఓ మగాడికి ఆమె శీలాన్ని దోచుకునే అధికారం ఉంది.

హత్య ఉంది. ఒక పెళ్ళికాని పిల్ల.... అదీ మరో వారం రోజుల్లో పెళ్ళికాబోతున్న పిల్ల మానాన్ని మంటకలిపే అధికారం ఓ మగాడికుంది అలాంటి నరరూప రాక్షసుడి నుంచి తప్పించుకోవాలని, ఆ కామపిశాచి కామదాహానికి తన శీలాన్ని పణంగా పెట్టకుండా... తన మానాన్ని... ప్రాణాన్ని .. అన్నిటికన్నా స్త్రీకి అతి విలువైన తన శీలాన్ని కాపాడుకోవ డానికి మరో మార్గం లేక ... గత్యంతరం లేక... ఆ కసాయివాడి ప్రాణం తీసింది. ఏ పరిస్థితిలో ఆమె అలా చెయ్యవలసి వచ్చిందో... ఆ పరిస్థితి రావడానికి కారకు లెవరో.... ఆ పరిస్థితి రాకుండా ఉండ డానికి ఆమె చేసిన వ్యర్థ ప్రయత్నాలు గానీ ... ఆ పరిస్థితి నుంచి తప్పించు కోవడానికి ఆమె ఎంత దీనంగా ప్రాధేయపడిందో.... ఇవన్నీ మీకు గానీ . మీ కోర్టుకుగానీ... మీ చట్టా నికిగానీ అర్థంకావా ? ఈ పరిస్థితులేవీ మీకుగానీ... మీ కోర్టుకుగానీ.... మీ చట్టానిగానీ అవసరంలేదు. అక్కర్లేదు. మీకు కావలసింది ఒక్కటే.... ఇందు మతి హత్యచేసింది. ..ఆమె.... హంత కురాలు . ఆమెని శిక్షించాలి.... అంతే ....అంతే...." ఇందుమతి ఓ క్షణం పాటు ఆగింది.


కోర్టు నిశ్శబ్దంగా ఉంది.

"కోర్టుకి కళ్ళే కాదు... చెవులూ లేవు. చెవులే కాదు.... మనసూ లేదు. మాన వత్వం అంటే ఏమిటో కూడా తెలీదు. మీ చట్టాలు అవీ అమాయకులని కాపా డ్డానికి అని మీరు చెప్పుకోవచ్చు. కానీ... ఇవి.... ఈ మీ చట్టాలు అమాయకుల పాలిట కష్టాలు.... ఇవి రక్షించడానికి కాదు ... భక్షించడానికి. మీ ఈ చట్టా లన్నీ దోషుల్ని కాపాడే ఉక్కు కవచాలు....

సింహాల్ని.... పులుల్ని వేటాడే వేట గాళ్ళకి మీ చట్టం.... లైసెన్సు ఇస్తుంది రివాల్వర్ప్‌కి.... గన్‌కి.... అవి క్రూర జంతువులైనా....అనవసరంగా మనుష్యు లని వేటాడవు.... చంపవు.... కానీ వేటగాళ్ళు సరదాగా.... వేటాడి వాటిని చంపుతూ ఉంటారు.... అలాంటి వేట గాళ్ళకి వేటాడ్డానికి.... ప్రాణ రక్షణ కోసం మీ చట్టం లైసెన్సు ఇస్తుంది.... మరి.. స్త్రీల జీవితాలతో సరదాగా వేటాడే గోపాలరావులాంటి క్రూర మృగాల నుంచి తప్పించుకోవడానికి మీ చట్టం స్త్రీలకెలాంటి లైసెన్సు ఇవ్వదా? వాళ్ళ వేటలో ఇందుమతిలాంటి అమాయ కులు బలి అవవలసిందేనా....? మీ చట్టం ఇందుమతిలాంటి వాళ్ళని ఎక్కడ రక్షి స్తోంది.?"

ఆవేశంగా మాట్లాడుతోంది ఇందుమతి...

"నా స్థానంలో మీ కన్నతల్లో... మీరు కట్టుకున్న భార్యో.... మీ తోడ బుట్టిన చెల్లెలో.... మీ కన్నకూతురో



ఉంటే ఏం చేసేవాళ్ళు వాళ్ళు ఏం చెయ్యాలని మీరు కోరుకునేవారు. ఏంచేస్తే మీరు ఆనందించేవారు... ఒక వేళ మీ కళ్ళ ముందే ఇలాంటి ఘోరం జరుగుతూంటే మీరేం చేసేవారు..?"

ఆ రోజు నాకు జరగబోయిన అన్యాయం మరే కన్నతల్లికి.. మరే ఇల్లాలికి. మరే చెల్లెలికీ.... మరే కూతురుకి. జరగకుండా ఉండడానికే నేను ఆ దుర్మార్గుణ్ని చంపేశాను. నేను చేసింది మీ దృష్టిలో . మీ కోర్టు దృష్టిలో మీ చట్టం దృష్టిలో నేరం

కావచ్చు. ఘోరమైన తప్పు కావచ్చు... మీరు నన్ను హంతకురాలు అని దిల్ల గుద్ది చెప్పొచ్చు.... అయినా ఫరవాలేదు. అలాంటి ఓ నీచుణ్ని చంపి ఎంతోమంది అమాయకులని రక్షించగలిగానన్న తృప్తి చాలు నాకు.... ఆ తృప్తి ముందు ఈ రోజు మీరు నాకు వేసిన ఉరిశిక్ష ఓ శిక్ష కాదు. కాకపోతే.... నాకు అర్థం కాని ప్రశ్న ఒకటుంది...."

ఇందుమతి ఓ సారి కోర్టుహాలంతా కలయచూసింది.

"కోర్టు బోనులో జడ్జి రాఘవరావు గారు ముద్దాయిగా నిలబడాలి. నేను పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆయన్ని కొన్ని ప్రశ్నలడగాలి." అన్న నా చివరి కోరికని మన్నించినందుకు మీకు నా కృతజ్ఞతలు ....దిసిజ్ మై లాస్ట్ క్వశ్చన్ టు యు.... సర్" ఆయాసం వల్ల ఓ రెండు క్షణాలు ఆగింది ఇందుమతి.... తిరిగి ప్రారంభించింది....

"మై డియర్ ....హానరబుల్ జడ్జి ... రాఘవరావు.... మీ జడ్జిమెంటులో ఇందుమతి హత్యచేసిందనీ.... హంతకురాలనీ.... ఓ మనిషి ప్రాణం తీసే అధికారం మరో మనిషికి లేదనీ, ఆఖరికి పుట్టించిన ఆ దేవుడికి కూడా లేదనీ.... అంచేత ఇందుమతికి ఉరిశిక్ష వేశారు... మరి మీ విషయంలో అది వర్తిస్తుందా... ....నా ప్రశ్న..

ఇందుమతీ సాటి మనిషే.... మీరూ సాటి మనిషే.... ఇందుమతి ప్రాణాన్ని తీసే ఈ ఉరిశిక్ష తీర్పునిచ్చే అధికారం.. హక్కు మీకెక్కడిది? ఇందుమతిని ఉరితీసేది కూడా మరో సాటిమనిషే.... ఆ అధికారం....ఆ హక్కు ఆ మనిషికెక్కడిది? మనల్ని పుట్టించిన దేవుడికి కూడా మన ప్రాణాల్ని తీసే అధికారం లేదన్నారు.... అలాంటప్పుడు ఆ అధికారం.... హక్కు మీకుగానీ.... మరో మనిషికిగానీ.... మీ చట్టానికిగానీ ఎక్కడిది? ఎవరిచ్చారు?

ఇందుమతి రేపు ఉరిశిక్షకి బలై చచ్చిపోతే.... ఆమె చావుకి కారణం.... తీర్పు ఇచ్చిన మీరు.... ఉరితీసిన మరో మనిషీ....మీరిద్దరూ కూడా హంతకులే.. మీకేం శిక్ష విధించాలన్నదే నా ప్రశ్న... జడ్జిగా మీరేం తీర్పునిస్తారు....?"

ఇందుమతికి ఆయాసం ఎక్కువైంది... ఇంక మాట్లాడలేక... కుప్పలా కూలిపోయింది....

జడ్జి రాఘవరావుగారు కోర్టు జనం.... ఇందుమతి.... కుప్పలా కూలిపోవడం ఇవేవీ గమనించటంలేదు.... ఆయన కళ్ళముందు వేలాడుతున్న ఉరి త్రాడు కదులుతోంది.